


Truth of News
PRGI Reg No: APTEL/26/A4782
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 12 | గురువారం 06 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## కీవ్‌పై రష్యా భీకర దాడులు

- పెద్ద ఎత్తున క్షిపణులు, డ్రోన్ల ప్రయోగం
- 17 మంది మృతి.. 44 మందికి గాయాలు

కీవ్ - సూర్య వాస్తవం

ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై మంగళవారం రాత్రి రష్యా సేనలు పెద్ద ఎత్తున క్షిపణి, డ్రోన్ దాడులు జరిపాయి. ఈ దాడులలో కనీసం 17 మంది మరణించగా 44 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు బుధవారం తెలిపారు. ఉక్రెయిన్ రాజధానిపై ఈ ఏడాది జరిగిన

- మిగతా 2లో..

# ఆందోళనను కొనసాగిస్తాం

- స్పష్టం చేసిన ప్రతిపక్షం
- ప్రతిపక్షాన్ని బుజ్జగించేందుకు కేంద్రం ప్రయత్నాలు
- డీలిమిటేషన్‌పై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకు సన్నాహాలు..!



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువతపై దాడికి కేంద్ర హోం మంత్రి వివరణ ఇవ్వాలనీ, అయోధ్యలోని రామ మందిర దోపిడీపై చర్చించాలని కోరడంతో పాటు, తమ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించే వరకు పార్లమెంటు లోపలా వెలుపల తమ ఆందోళనను కొనసాగిస్తామని ప్రతిపక్షం స్పష్టం చేసింది. ప్రతిపక్షాల నిరసనలతో పార్లమెంటు వర్షాకాల సమావేశాలు అట్టుడికిపోతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాన్ని బుజ్జగించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షం తమ వైఖరిని కేంద్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. బుధవారం ప్రతిపక్షాల నినాదాల మధ్య లోక్‌సభ సమావేశమైన కొద్ది నిమిషాలకే వాయిదా పడిన అనంతరం, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు భేటీ అయ్యారు. పార్లమెంట్ హౌస్‌లోని రాహుల్ ఛాంబర్‌లో సుమారు 50 నిమిషాల పాటు ఈ సమావేశం సాగింది. రాహుల్‌తో పాటు కాంగ్రెస్ ఎంపీలు ప్రియాంక గాంధీ వాద్రా, కెసి వేణుగోపాల్, గౌరవ్ గొగోయ్

- మిగతా 2లో..

## అట్టుడికిన పార్లమెంట్

- సభ లోపలా బయటా ప్రతిపక్షాల ఆందోళన
- మహాత్మా గాంధీ విగ్రహం నుంచి మకర ద్వార్ వరకు మార్చ్
- 'అమిత్ షా దాక్కోవద్దు... పార్లమెంటులో సమాధానం చెప్పాలి' అంటూ ప్లకార్డులు
- విద్యార్థుల పట్ల అమానుషంగా ప్రవర్తించినందు వల్లే ముఖం చాటేశారు : రాహుల్ గాంధీ
- అమిత్ షా సభకు ఎందుకు రావడం లేదు : మల్లికార్జున ఖర్గే

2లో





## రాహుల్ గాంధీతో కిరణ్ రిజిజు భేటీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు మూడోవారంలోనూ వాడీవేడీగా సాగుతున్నాయి. పది రోజుల క్రితం జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఆందోళనలపై లాఠీచార్జీ ను నిరసిస్తూ ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. అయోధ్య రామందిర్ విరాళాల చోరీపై సమగ్ర చర్చ జరగాలని, పారదర్శక

- మిగతా 2లో..

# కర్ణాటక కాంగ్రెస్‌లో రెబెల్ మంటలు..



- క్యాబినెట్ విస్తరణ తర్వాత ఎమ్మెల్యేల రాజీనామా డ్రామా!
- మంత్రి పదవులు దక్కక కాంగ్రెస్‌లో మొదలైన రాజీనామాలు
- రాజీనామాలను నిమిషాల్లో ఆమోదిస్తానన్న సీఎం డీకే శివకుమార్
- 2028లో పార్టీ పతనం తప్పదంటూ మాజీ మంత్రి సంచలన వ్యాఖ్య
- అసమ్మతి నేతలను బుజ్జగించేందుకు రంగంలోకి దిగిన అధిష్ఠానం

బెంగళూరు - సూర్య వాస్తవం

ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ కలకలం రేపుతోంది. మంత్రి పదవులు దక్కని పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు బహిరంగంగానే అసమ్మతి స్వరం వినిపిస్తుండటంతో పార్టీలో సంక్షోభం ముదురు తోంది. కొందరు రాజీనామాలకు సిద్ధపడగా, మరికొందరు పార్టీ భవిష్యత్తుపైనే సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇండి నియోజకవర్గానికి చెందిన సీనియర్ ఎమ్మెల్యే యశ్వంతరాయగౌడ పాటిల్ ఇప్పటికే తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. సాగర్ ఎమ్మెల్యే బేలూరు గోపాలకృష్ణతో పాటు మరికొందరు కూడా ఇదే బాటలో ఉన్నట్లు ప్రకటించారు. ఈ పరిణామాలపై మాజీ మంత్రి కేఎన్ రాజణ్ణ స్పందిస్తూ.. ప్రస్తుత పరిస్థితుల్లో డీకే శివకుమార్ పార్టీని నడపడం కష్టమని, 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ మట్టికరిచినా ఆశ్చర్యం లేదని వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది.

ఈ తిరుగుబాటు వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. "రాజీనామా చేయాల నుకునే వారు నిరభ్యం తరంగా చేయవచ్చు. వారి రాజీనామాలను నిమిషాల్లో ఆమోదిస్తాను. ఎవరినీ బలవంతంగా ఆపలేం" అని ఘాటుగా హెచ్చరించారు. పార్టీ భవిష్యత్తు ముఖ్య మను కునే వారు ఇక్కడే ఉంటారని ఆయన స్పష్టం చేశారు. పరిస్థితి చేయి దాటుతుండ టంతో కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దిగింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ రణ్‌దీప్ సుర్జేవాలా అసమ్మతి నేతలను బుజ్జ గించే ప్రయత్నాలు చేస్తున్నారు. వారికి బోర్డులు, కార్పొరేషన్ల ఛైర్మన్ పదవులు ఆఫర్ చేస్తున్నప్పటికీ నేతలు వెనక్కి తగ్గడం లేదు. ఒకవేళ నేతలు పట్టు వీడకపోతే వారి రాజీనామాలను ఆమో దించడానికి కూడా వెనుకాడ వద్దని హైకమాండ్ రాష్ట్ర నాయకత్వానికి సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.



## నిరసనల్లో పాల్గొనే యువత పట్ల అత్యంత సహనంతో వ్యవహరించాలి

- హింసను అదుపు చేసే క్రమంలో బలగాలు జాగ్రత్తగా ఉండాలన్న సుప్రీంకోర్టు
- యువత ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని హెచ్చరిక
- యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని వ్యాఖ్య

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి ఆందోళనలు, వాటి సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల్లో పాల్గొంటున్న విద్యార్థుల పట్ల అధికారులు అత్యంత విచక్షణతో, సహనంతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. హింసను అదుపు చేసే నెపంతో భద్రతా బలగాలు కూడా అంతే తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని

- మిగతా 2లో..



## రాజకీయ పార్టీ కాదు ప్రజా ఉద్యమ వేదికే

- ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నిస్తాం
- సీజేపీపై ఊహాగానాలకు అభిజిత్ దీప్కే తెర
- దేశవ్యాప్తంగా ఉద్యమ విస్తరణకు కార్యాచరణ

2లో

# విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్..

- సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం
- ప్రభుత్వ వాటాగా రూ.4 లక్షల కోట్లు, ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు
- మూలపేట పోర్టు నుంచి రాజమండ్రి అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు అభివృద్ధి
- ఏఐ డేటా సెంటర్లు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి



అమరావతి - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అత్యంత కీలకమైన విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



## తెలంగాణ విద్యార్థుల వీసాలను పెంచండి

- అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో రేవంత్ రెడ్డి భేటీ
- వీసా ఇంటర్వ్యూల స్లాట్ల పెంపు, ఇతర అంశాలపై విజ్ఞప్తి

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే తెలంగాణ విద్యార్థుల వీసాలను పెంచాలనీ, వీసా అపాయింట్‌మెంట్లు సకాలంలో లభించేలా సహకరించాలని భారత్‌లో అమెరికా రాయబారి సెర్జియో గోర్ కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

- మిగతా 2లో..

# కీవ్‌పై రష్యా భీకర దాడులు

(మొదటిపేజీ తరువాయి)

భీకర దాడులలో ఇది కూడా ఒకటి. ఈ దాడిలో పాతికకు పైగా బాలిస్టిక్, నౌకా విధ్వంసక క్షిపణులను, వందకు పైగా డ్రోన్లను రష్యా ప్రయోగించింది. రష్యా నుంచి దూసుకొచ్చిన బాలిస్టిక్ క్షిపణులలో దేనినీ అడ్డుకోలేకపోయామని, గగనతల రక్షణ వ్యవస్థల కొరతే దీనికి కారణమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ చెప్పారు. ఈ వ్యవస్థలు అందుబాటులో ఉంటే ఇంత ప్రాణనష్టం జరిగి ఉండేది కాదని అన్నారు. భాగస్వామ్య దేశాల నుంచి బాలిస్టిక్ నిరోధక వ్యవస్థల సరఫరాలో జరుగుతున్న జాప్యం కారణంగానే మృతుల సంఖ్య ఎక్కువగా ఉన్నదని, విధ్వంసం కూడా భారీగానే జరుగుతోందని వివరించారు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత మొదలైన దాడులలో కీవ్, దాని పరిసర ప్రాంతాలలో అనేక జనావాస భవనాలు, ఒక రైల్వే స్టేషన్, పలు గిడ్డంగులు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. అత్యవసర సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాలు చేపట్టారు. ఈ దాడులలో ఉక్రెయిన్ వైమానిక దళం 24 బాలిస్టిక్ క్షిపణులు, నాలుగు నౌకా విధ్వంసక క్షిపణులు, 115 డ్రోన్లను ప్రయోగించింది. ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థలు 98 డ్రోన్లను అడ్డుకున్నాయి. అయితే బాలిస్టిక్ క్షిపణులను నిరోధించలేకపోయాయి. తమ దళాలు లాజిస్టిక్ హబ్‌లు, సరఫరా కేంద్రాలు, ఆయుధ నిల్వ స్థావరాలు, డ్రోన్ తయారీ కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేసిందని రష్యా రక్షణ శాఖ తెలియజేసింది. నల్ల సముద్రం ఓడరేవు నగరమైన ఒడెసా సమీపంలో మూడు సరకు రవాణా నౌకలపై కూడా దాడి చేశామని చెప్పింది. శిథిలాల కింద కొంతమంది చిక్కుబడి ఉండవచ్చునని సహాయ సిబ్బంది అనుమానిస్తున్నారు.

### నిరసనల్లో పాల్గొనే యువత పట్ల
# అత్యంత సహనంతో వ్యవహరించాలి

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లలో సీజేపీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయని, జులై 20 నాటి నిరసనల్లో రాళ్లదాడి, హింస కారణంగా సార్వజనిక ఆస్తులకు జరిగిన నష్టానికి ఆ సంస్థనే బాధ్యులను చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కొత్త అర్జీని కూడా ఢిల్లీ తదితర ప్రాంతాల్లోని విద్యార్థి ఆందోళనలకు సంబంధించిన ప్రధాన కేసులతో సుప్రీంకోర్టు జతచేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత ప్రదర్శనల సమయంలో పోలీసులు అత్యంత సంయమనం పాటించాలని సూచించిన సీజేఐ... యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని పేర్కొన్నారు. యువకులు అసలు ఏం కోరుకుంటున్నారు, వారి ఆవేదనకు కారణమేంటో ఓపికగా వినడమే అన్ని సమస్యలకు అత్యంత శక్తివంతమైన పరిష్కారమని వ్యాఖ్యానించారు. అయితే శాంతిభద్రతలను కాపాడే క్రమంలో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల విచక్షణపై తమకు నమ్మకం ఉందని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నివేదికలను పరిశీలించిన పిమ్మటే ఈ విషయంలో తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు ధర్మాసనం తెలిపింది.

### రాహుల్ గాంధీతో
# కిరణ్ రిజిజు భేటీ

(మొదటిపేజీ తరువాయి)

దర్యాప్తు నిర్వహించాలని మోడీ ప్రభుత్వాన్ని విపక్ష సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతిపక్షాల ఆందోళన నేపథ్యంలోనే కేంద్రం పలు బిల్లులను ఆమోదించింది. తాజాగా గత పార్లమెంట్ సమావేశాల్లో వీగిపోయిన డీలిమిటేషన్ బిల్లును ప్రస్తుత సమావేశాల్లో ప్రవేశపెట్టాలని మోడీ ప్రభుత్వం పావులు కదుపుతోంది. అందుకు పార్లమెంట్ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజును రంగంలోకి దింపింది. దీనిలో భాగంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో ఆయన భేటీ అయ్యారు. ప్రభుత్వం ప్రతిపాదించే డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు తెలపాలని కోరినట్లు సమాచారం. అయితే రిజిజు ప్రతిపాదను రాహుల్ గాంధీ తిరస్కరించనట్లు జాతీయ మీడియాలు పేర్కొన్నాయి. ఉభయ సభల్లో అయోధ్య రామ్ మందిర్ విరాళాల చోరీపై చర్చ జరగాలని, అలాగే రాజధానిలో జూలై 20న జరిగిన నిరసన సందర్భంగా విద్యార్థులపై పోలీసులు తీసుకున్న చర్యల గురించి.. హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేసేంత వరకు సభలో ఎటువంటి కార్యకలాపాలు జరగవని ప్రతిపక్ష నాయకుడు కిరణ్ రిజిజుకు చెప్పారని సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా, గత పార్లమెంట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లును మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ చర్యను ప్రతిపక్షాలు ముక్తకంఠంతో వ్యతిరేకించాయి. డీలిమిటేషన్ బిల్లును వేరుగా ప్రవేశపెట్టాలని, సదురు బిల్లుపై రాష్ట్రాలకు పలు సందేహాలున్నాయి తెలియజేశాయి. అయినా కానీ మోడీ ప్రభుత్వం మొండిగా ముందుకుకెళ్లడంతో లోక్ సభలో సదురు బిల్లు వీగిపోయింది

### విశాఖ రూపురేఖలు మార్చే
# మాస్టర్ ప్లాన్..

(మొదటిపేజీ తరువాయి)

ఈ బృహత్ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ సమీక్షా సమావేశంలో వీఈఆర్ ప్రాజెక్టు ఆర్థిక స్వరూపాన్ని, కార్యాచరణను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం పెట్టుబడులలో భాగంగా ప్రభుత్వం రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు సమకూర్చాలని, మిగిలిన రూ.5.30 లక్షల కోట్లను ప్రైవేట్ రంగం నుంచి రాబట్టేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించారు. 'బేసిటీ' ప్రాజెక్టును యాంకర్ ప్రాజెక్టుగా చేసుకుని విశాఖ రీజియన్ అభివృద్ధిని చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. వీఈఆర్ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని సూక్ష్మ స్థాయి ప్రణాళికతో సమగ్రాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ప్రణాళిక మూలపేట పోర్టు నుంచి రాజమండ్రిలోని అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు విస్తరించి ఉండాలని ఆయన సూచించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీ వంటి కీలక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వివిధ ప్రాజెక్టులను పరస్పరం అనుసంధానించడం ద్వారానే విశాఖ ఎకనామిక్ రీజియన్ వేగంగా ప్రగతి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. నిధుల కన్వర్జెన్స్ పద్ధతిని అనుసరించాలని, అవసరమైన చోట వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ స్కీంను కూడా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆందోళనను కొనసాగిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

తదితరులు పాల్గొన్నారు. సభ సజావుగా సాగేందుకు ఆయన సహకారాన్ని కోరారు. హోం మంత్రి అమిత్ షా వివరణ ఇవ్వడం, దోపిడీపై చర్చించడం వంటి డిమాండ్లను అంగీకరించే వరకు నిరసన కొనసాగుతుందని రాహుల్ అన్నారు. ఈ భేటీలో వివాదాస్పద డీలిమిటేషన్ బిల్లు, ఫారిన్ కంట్రిబూషన్ రెగ్యులేటింగ్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లుపై ప్రధానంగా చర్చలు జరిగినట్టు సమాచారం. అయితే.. రిజిజు అభ్యర్థనను రాహుల్ పూర్తిగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. అయోధ్య రామ మందిరంలో జరిగిన విరాళాల చోరీ ఆరోపణలపై చర్చ, అలాగే ఢిల్లీలో జులై 20న జరిగిన నిరసనల సందర్భంగా విద్యార్థులపై పోలీసుల చర్యకు సంబంధించి హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేసే వరకు సభలో కార్యకలాపాలను అడ్డుకుంటామని రిజిజుతో రాహుల్ చెప్పినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రాహుల్‌తో సమావేశం అనంతరం, కిరణ్ రిజిజు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, హోం మంత్రి అమిత్ షాలను కలిశారు. రాబోయే రోజుల్లో ప్రతిపక్షాన్ని బుజ్జగించే ప్రయత్నాలు కొనసాగుతాయని కిరణ్ రిజిజు తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్‌తో సహా ప్రతిపక్ష నాయకులతో సమావేశాలు నిర్వహిస్తారు.

**డీలిమిటేషన్ బిల్లుకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు**

నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మహిళా రిజర్వేషన్‌ను అమలు చేసేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును తిరిగి ప్రవేశపెట్టేందుకు, కేంద్ర ప్రభుత్వం మూడురోజుల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం. ఈ నెల 16, 17, 18 తేదీలలో ప్రత్యేక సమావేశం నిర్వహించే అంశంపై కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల స్పందనను కోరింది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఈ బిల్లును ఆమోదించుకోవాలని చూస్తోంది. తృణమూల్ కాంగ్రెస్, శివసేనలోని ఉద్ధవ్ థాకరే వర్గం మధ్య చీలిక (ఈ వర్గం నుంచి పలువురు ఎంపీలు ఎన్డీఏలోకి వచ్చారు), ఇండియా బ్లాక్ నుంచి డీఎంకే దూరంగా ఉండటం వంటి అంశాలు బిల్లు ఆమోదానికి అనుకూల పరిస్థితులను సృష్టిస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ బిల్లును ఆమోదింపజేయ డంలో సహాయపడాలని ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలను అభ్యర్థిస్తోంది. బిల్లుకు మద్దతు ఇవ్వలేకపోతే ఓటింగ్‌కు దూరంగా ఉండి సహకరించాలని తెలిపింది. ఎన్‌సీపీ శరద్ పవార్ వర్గం మద్దతును కూడగట్టడానికి కూడా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ బిల్లు మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించలేక గతంలోనే లోక్‌సభలో వీగిపోయింది.

**బిల్లు నెగ్గడం కష్టమే**

నియోజకవర్గాల పునర్విభజన బిల్లును తిరిగి ప్రవేశపెట్టాలన్న తన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం విరమించుకుంటుందా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇటీవల ఎన్డీఏలో భాగమైన శివసేన ఉద్ధవ్ వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు కూడా ఉన్నారు. వీరికి తోడుగా, 22 మంది ఎంపీలు ఉన్న డీఎంకే, ఎనిమిది మంది ఎంపీలు ఉన్న శరద్ పవార్ వర్గం మద్దతును కూడా ప్రభుత్వం ఆశిస్తోంది. ఒకవేళ డీఎంకే, పవార్ వర్గం, తృణమూల్ తిరుగుబాటుదారుల మద్దతు లభించినా, ఎన్డీఏ మెజారిటీ 348 స్థానాలకే పరిమితమవుతుంది. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇవ్వడం తమకు కష్టమని డీఎంకే ప్రభుత్వానికి తెలియజేసింది. ఒకవేళ డీఎంకే ఓటింగ్‌కు దూరంగా ఉన్నా, కేంద్ర ప్రభుత్వానికి మూడింట రెండు వంతుల మెజారిటీ వచ్చే అవకాశాలు చాలా తక్కువ. ఈ పరిస్థితుల్లో, కేంద్ర ప్రభుత్వం నుంచి కచ్చితంగా విఫలమయ్యే మరో రాజకీయ ఎత్తుగడ వస్తుందేమోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఎదురుదెబ్బ నుంచి ఇంకా కోలుకోని బీజేపీ, కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత పరిస్థితుల్లో మరో ఎదురుదెబ్బను తట్టుకోగలవా అనే ప్రశ్న కూడా తలెత్తింది.

**డీలిమిటేషన్‌పై గత సమావేశాల్లోనే వైఖరిని స్పష్టం చేశాం**

డీలిమిటేషన్ బిల్లుపై ప్రభుత్వం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తోందన్న వార్తలపై కాంగ్రెస్ ఎంపీ కెసి వేణుగోపాల్ స్పందించారు "మాకేమీ తెలియదు. ప్రత్యేక సమావేశం ఉద్దేశం ఏమిటి? ఈరోజు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు డీలిమిటేషన్‌పై చర్చించడానికి, ప్రతిపక్షాల వైఖరి తెలుసుకోవడానికి మమ్మల్ని కలిశారు. డీలిమిటేషన్‌పై మా వైఖరి చాలా స్పష్టం. గత పార్లమెంట్ సమావేశాల్లో మా వైఖరి ఎలా ఉందో, ఇప్పుడూ అలాగే ఉంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు" అని అన్నారు. 'ప్రభుత్వ ఎజెండాతో, ప్రధానమంత్రి ఎజెండాతో' కలిశారని అన్నారు. 'పార్లమెంటు చర్చలు, సంప్రదింపుల కోసమే ఉంది. వారికి ఎలాంటి చర్చ, సంప్రదింపులు వద్దు. వారు అన్నింటినీ కూల్చివేయాలని చూస్తున్నారు. వారు వేరే చట్టాలను తీసుకురావాలని చూస్తున్నారు, దానికి మేము ఏమాత్రం అంగీకరించలేము. ఈరోజే అదే జరిగింది" అని ఆయన అన్నారు. "ప్రభుత్వం దీనికి పరిష్కారం ఇవ్వాలి. మేము ఈ విషయాన్ని లేవనెత్తుతున్నాము. ఢిల్లీ పోలీసులు విద్యార్థులపై దారుణంగా దాడి చేశారు. బీహార్‌లో ఎకె-47ని ఉపయోగిస్తున్నారు. దేశ హోం మంత్రి నుంచి సమాధానం రావాలి. ఆయన ఎందుకు పారిపోతున్నారు? 'చందా చోరీ' , రామ మందిరం విషయంలోనూ సమాధానం లేదు. మేము కేవలం చర్చను మాత్రమే కోరుతున్నాము. రామ మందిర విరాళం విషయంలో ఏం జరిగింది? 'భక్తులు' అని చెప్పుకునే ఈ వ్యక్తులు ఇప్పుడు పూర్తిగా శ్రీరాముడి డబ్బును దొంగిలిస్తున్నారు. జవాబుదారీతనం లేదు, సరైన విచారణ జరగడం లేదు" అని వేణుగోపాల్ అన్నారు.

# అట్టుడికిన పార్లమెంట్

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

అయోధ్య రామమందిరం విరాళాల చోరీ, విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల దాడిపై కేంద్ర హోం మంత్రి సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళనతో పార్లమెంట్ అట్టుడికింది. బుధవారం పార్లమెంట్ ఉభయ సభల్లోనూ, పార్లమెంట్ ఆవరణలోనూ ప్రతిపక్షాల ఆందోళన జరిగింది. పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ప్రేరణా స్థల్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం నుంచి మకర ద్వార్ వరకు మార్చ్ చేపట్టారు. 'దాక్కోవద్దు.. పార్లమెంటులో సమాధానం చెప్పండి' అంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకి వ్యతిరేకంగా ప్లకార్డులు చేబూని నినాదాల హోరెత్తించారు. "విద్యార్థుల పట్ల అమానుషంగా ప్రవర్తించినందు వల్లే హోం మంత్రి ముఖం దాక్కుంటున్నారు" అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యార్థులపై పోలీసుల దురాగతాల పట్ల హోం మంత్రి అమిత్ షా ప్రకటన, రామ మందిర విరాళాల దుర్వినియోగంపై చర్చ, జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ అమిత్ షా సభకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు.

"వారు పార్లమెంటును అగౌరవపరుస్తున్నారు. ఇన్ని రోజులు గడిచినా వారు సభలోకి అడుగు పెట్టడం లేదు. సభకు వచ్చి ప్రకటన ఇవ్వడంలో సమస్య ఏమిటి?" అని ప్రశ్నించారు. అమిత్ షా చెవిటివారా, మూగవారా? అని ప్రశ్నించారు. మరోవైపు బుధవారం కూడా ప్రతిపక్షాల ఆందోళనతో పార్లమెంట్ ఉభయ సభలు వాయిదాల పర్వం తొక్కాయి. రెండు సభల్లో ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా లోక్‌సభలో రామ మందిర విరాళాల కుంభకోణంపై నిరసన తెలిపిన ప్రతిపక్ష పార్టీలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, సీపీఐ, సమాజ్‌వాదీ పార్టీలు ఎల్లప్పుడూ శ్రీరాముడిని వ్యతిరేకిస్తున్నాయని, పార్లమెంట్ ప్రాంగణంలో వారు ప్రదర్శించిన "చందా చోరీ" స్కిట్ ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని ఆయన పేర్కొన్నారు.

అంతేకాకుండా, సభ సజావుగా పనిచేయడాన్ని ప్రతిపక్షం కోరుకోవడం లేదని ఆరోపించారు. "కేసీ వేణుగోపాల్ మంచి మనిషే, కానీ ఆయన తన పార్టీ సభ్యులకు మర్యాద పాటించాలని అర్థమయ్యేలా చెప్పలేకపోతు న్నారు" అని అన్నారు. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే కేంద్ర మంత్రి ప్రకటనపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రభుత్వమే సభను నిర్వహించేందుకు సిద్ధంగా లేదని, ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు హాజరు కావడం లేదని అన్నారు.

# రాజకీయ పార్టీ కాదు ప్రజా ఉద్యమ వేదికే

**ఛత్రపతి శంభాజీనగర్ - సూర్య వాస్తవం**

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) రాజకీయ పార్టీగా మారబోదని ఆ సంస్థ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. ఇది ప్రజా సమస్యలపై ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రజా ఉద్యమ వేదికగానే కొనసాగుతుందని చెప్పారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరుగుతున్న రెండు రోజుల వ్యూహ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. దీంతో సీజేపీ ఎన్నికల రాజకీయాల్లోకి అడుగు ఎడుతుందనే ప్రచారానికి ఈ ప్రకటనతో తెరపడినట్ట య్యింది. కేవలం రెండు నెలల క్రితం వ్యంగ్యాత్మక ఆలోచనతో ప్రారంభమైన కాక్రోచ్ జనతా పార్టీ... అతి తక్కువ కాలంలోనే యువత సమస్యలను ప్రధాన ఎజెండాగా తీసుకున్న ఉద్యమ వేదికగా గుర్తింపు పొం దింది. పరీక్షల అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, నిరుద్యోగం, విద్యా వ్యవస్థలోని లోపాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించే ప్రయత్నం చేసింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో జరిగిన విద్యార్థి ఉద్యమాలకు దీప్కే నాయకత్వం వహించడం ద్వారా సీజేపీ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**రాజకీయాలకు దూరం ....**

రాజకీయ పార్టీ ఏర్పాటు చేసే ఆలోచన ప్రస్తుతం తమకు లేదని దీప్కే స్పష్టం చేశారు. "పార్టీగా మారాలన్న ఆసక్తి కంటే మీడియాకే ఆ అంశంపై ఎక్కువ ఆసక్తి కనిపిస్తోంది. మేము ప్రజల సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నించే, ఒత్తిడి తీసుకొచ్చే ప్రజా వేదికగానే కొనసాగుతాం" అని తెలిపారు. యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, విద్యా వ్యవస్థలో అవకతవకలు, పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం వంటి అంశాలపై పోరాటాన్ని మరింత విస్తరిస్తామని చెప్పారు.

**దేశవ్యాప్తంగా 'లిజనింగ్ టూర్'**

సీజేపీని దేశవ్యాప్తంగా విస్తరించే కార్యాచరణను ప్రారంభిస్తున్నట్టు దీప్కే తెలిపారు. యువత సమస్యలు, అభిప్రాయాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా 'లిజనింగ్ టూర్' చేపట్టనున్నట్టు వెల్లడించారు. దేశంలోని ఏ రాష్ట్రంలో విద్యార్థులు తమ హక్కుల కోసం పోరాడినా వారికి అండగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం జార్ఖండ్‌లో జేపీఎస్సీ సివిల్స్ పరీక్షలో అక్రమాల ఆరోపణలపై కొనసాగుతున్న విద్యార్థి ఉద్యమానికి సంఘీభావం ప్రకటించే అంశాన్ని కూడా సమావేశంలో చర్చిస్తున్నట్టు తెలిపారు. అవసరమైతే అక్కడికి వెళ్లి మద్దతు ఇస్తామని చెప్పారు. జంతర్‌మంతర్ ఆందోళన సందర్భంగా 26 రోజులపాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తమ ఉద్య మానికి మార్గదర్శిగా ఉన్నారని వివరించారు. జార్ఖండ్ విద్యార్థి నాయకులతో వాంగ్‌చుక్ ఇప్పటికే మాట్లాడి సంఘీభావం ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, సీజేపీ సమావేశం జరుగుతున్న రోజే జార్ఖం డ్‌లో విద్యార్థులు ఆందోళన విరమించడం గమనార్హం.

**యువత ఐక్యతే బలం**

సీజేపీ వ్యూహ సమావేశంలో సంస్థ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాతో పాటు సుమారు 50 మంది కీలక వాలంటీర్లు పాల్గొన్నారు. యువత సమస్యలను ఒకే వేదికపైకి తీసుకురావడం, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ప్రజా ఒత్తిడి పెంచడమే సంస్థ లక్ష్యమని వారు తెలిపారు. "యువత ఐక్యంగా పోరాడితే మార్పు సాధ్యమేనని ఈ ఉద్యమం నిరూపించింది" అని సౌరవ్ దాస్ అన్నారు. వ్యంగ్య వేదికగా ప్రారంభమైన సీజేపీ... ప్రస్తుతం యువత సమస్యలపై జాతీయ స్థాయి ఉద్యమ వేదికగా ఎదగడానికి ప్రయత్నిస్తోంది. అయితే ఎన్నికల రాజకీయాలకు దూరంగా ఉండి ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని ఆ సంస్థ తీసుకున్న నిర్ణయం ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# తెలంగాణ విద్యార్థుల వీసాలను పెంచండి

(మొదటిపేజీ తరువాయి)

వీసా ఇంటర్వ్యూ స్లాట్లను పెంచాలని, వీసా దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని కోరారు. అలాగే అమెరికా హెచ్1 బీ వీసా ప్రాసెసింగ్, రెన్యువల్, వీసా స్టాంపింగ్ ఆలస్యం కాకుండా సరళతరం చేయాలని అభ్యర్థించారు. బుధవారం ఢిల్లీ పర్యటనలో భాగంగా అమెరికా రాయబారితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. దాదాపు 30 నిమిషాలకు పైగా సాగిన ఈ భేటీలో తెలంగాణలో విద్య, ఉపాధి, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయడంపై సీఎం ప్రస్తావించారు. అదే విధంగా అమెరికాలో ఉద్యోగాలు చేస్తోన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన వివిధ రంగాల నిపుణుల సమస్యలను కూడా రాయబారి దృష్టికి తీసుకెళ్లారు. వీసా నిబంధనల్లో వచ్చే మార్పులపై ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. అమెరికాలో చదువుతున్న తెలంగాణ విద్యార్థుల భద్రత, సంక్షేమంపై కూడా చర్చించారు. తెలంగాణలో అమెరికా సంస్థలకు విస్తృత పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఐటీ, కృత్రిమ మేధ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, స్టార్టప్‌లు, పరిశోధన, ఆధునిక సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని తెలిపారు.

**రాష్ట్ర విద్యా సంస్థలతో కలిసి పని చేసేందుకు సహకరించండి**

అమెరికా విశ్వవిద్యాలయాలు తెలంగాణ విద్యాసంస్థలతో కలిసి పనిచేసేలా సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. విద్యార్థుల మార్పిడి, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. అమెరికాలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న భారతీయ భాషల్లో తెలుగు ఒకటని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. దేశ చరిత్ర, సంస్కృతిపై రాయబారి సెర్జియో గోర్‌కు ఉన్న అవగాహన తనను ఆకట్టుకుందన్నారు.

## సంపాదకీయం

# గేమ్ ఛేంజర్ కానున్న సముద్ర మంథన్



ముడిచమురు, సహజవాయువు (గ్యాస్) అవసరాల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు భారత్ కీలక అడుగు వేసింది.సముద్రగర్భంలో దాగి ఉన్న చమురు, గ్యాస్ నిల్వలను వెలికితీయడమే లక్ష్యంగా రూ.84,084 కోట్ల అంచనా వ్యయంతో 'సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకం'కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.ఈ పథకం కింద సముద్రంలోని అత్యంత లోతైన, ప్రమాదకర ప్రాంతాల్లో చమురు, గ్యాస్ అన్వేషణ కోసం తవ్వే బావులకు అయ్యే ఖర్చులో సగం లేదా గరిష్ఠంగా రూ.650 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం నేరుగా బడ్జెట్ ద్వారా భరించనుంది.ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో, అంటే 2031 నాటికి, సముద్రగర్భంలో సుమారు 60 లోతైన, అత్యంత లోతైన బావులు తవ్వేందుకు రూ.43,200 కోట్లు కేటాయించారు.ఒక్కో బావికి గరిష్ఠంగా రూ.650 కోట్ల వరకు వ్యయం చేయనున్నారు. అలాగే ఆఫ్‌షోర్ ప్రాంతాల్లో సీస్మిక్, జియోలాజికల్ సర్వేలు నిర్వహించి చమురు, గ్యాస్ నిల్వల అవకాశాలను గుర్తించేందుకు రూ.28,534 కోట్లు వెచ్చించనున్నారు.సముద్రంలో లభించే చమురు, గ్యాస్‌ను తీర ప్రాంతాలకు తరలించేందుకు గ్యాస్ పైప్‌లైన్‌లు, ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.10,000 కోట్లు ఖర్చు చేయనున్నారు.అదనంగా ఆఫ్‌షోర్ రంగానికి అవసరమైన యంత్రాలు, సేవలు అందించే పారిశ్రామిక జోన్‌ల అభివృద్ధికి రూ.2,000 కోట్లు కేటాయించారు.లోతైన సముద్ర ప్రాంతాల్లో చమురు అన్వేషణలో విజయవంతం కాకపోతే భారీ పెట్టుబడులు వృథా అవుతాయనే భయంతో ప్రైవేట్ కంపెనీలు ఇప్పటివరకు ఈ రంగానికి దూరంగా ఉన్నాయి.చమురు నిల్వలు ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే తొలిసారిగా ప్రభుత్వం స్వయంగా బడ్జెట్ నిధులతో ఈ అన్వేషణలోని రిస్క్‌ను భరించేందుకు ముందుకొచ్చింది.చిన్న మొత్తాల్లో చమురు నిల్వలు లభించినా వాటిని వాణిజ్యపరంగా వినియోగించుకునేలా ప్రభుత్వ సాయంతో ఉమ్మడి పైప్‌లైన్‌లు, ప్రాసెసింగ్ మౌలిక వసతులు అభివృద్ధి చేయనుంది. దీంతో కంపెనీలపై పడే మౌలిక సదుపాయాల ఖర్చు గణనీయంగా తగ్గనుందగత పదేళ్లలో దేశంలో ముడిచమురు అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటం 77 శాతం నుంచి 88 శాతానికి పెరిగిందిఅలాగే దేశ అవసరాల్లో సగానికి పైగా సహజవాయువు కూడా దిగుమతుల ద్వారానే వస్తోంది.'సముద్ర మంథన్' పథకం ద్వారా ప్రతి ఏడాది 10 నుంచి 15 మిలియన్ టన్నుల అదనపు చమురు ఉత్పత్తి సాధించి, దిగుమతులను 3 నుంచి 5 శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.భారత్‌లో చమురు, గ్యాస్ రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 1997 నుంచి విధానాలను క్రమంగా సరళీకరిస్తోంది.ఇందులో భాగంగా 2016లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ పాలసీ , ఓపెన్ ఎకరేజ్ లైసెన్సింగ్ పాలసీ లను ప్రవేశపెట్టింది.అలాగే 2025 ఏప్రిల్‌లో అమల్లోకి వచ్చిన ఆయిల్ ఫీల్డ్స్ సవరణ చట్టం ద్వారా పన్నులు, లీజు విధానాలను మరింత సులభతరం చేసింది.ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు భారత్ తన చమురు అన్వేషణను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ సుమారు 18 నుంచి 20 బిలియన్ డాలర్ల భారీ వ్యయంతో లోతైన సముద్ర గర్భంలో డ్రిల్లింగ్ చేసేందుకు ప్రపంచవ్యాప్త టెండర్లను ఆహ్వానించింది. ఐదేళ్ల కాల పరిమితితో అత్యాధునిక డ్రిల్‌షిప్‌లు, సెమీ-సబ్ మెర్సిబుల్ రిగ్‌లను అద్దెకు తీసుకోవడమే ఈ టెండర్ ప్రధాన ఉద్దేశం. ఓఎన్‌జీసీ తన అన్వేషణ ప్రణాళికను కేవలం పాత బేసిన్‌లకే పరిమితం చేయకుండా, కొత్త సరిహద్దులను వెతుకుతోంది. ప్రస్తుతం చమురు ఉత్పత్తి అవుతున్న కృష్ణ-గోదావరి బేసిన్‌లో కార్యకలాపాలను ముమ్మరం చేయడంతో పాటు, ఇప్పటివరకు పెద్దగా అన్వేషించని అండమాన్, నికోబార్ దీవుల సమీపంలోని అత్యంత లోతైన జలాలపై దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టులోని సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రపంచ చమురు దిగ్గజాలైన ఎక్సాన్‌మొబిల్, బీపీ, టోటల్ ఎనర్జీస్, పెట్రోబ్రాస్‌ల సహకారాన్ని ఓఎన్‌జీసీ కోరుతోంది. ముంబైలో జరిగిన ప్రీ-బిడ్ సమావేశానికి ఇప్పటికే డజనుకు పైగా అంతర్జాతీయ సంస్థలు హాజరవ్వడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను చాటిచెబుతోంది. రష్యా చమురుపై పెరిగిన మొగ్గు.. ఒకవైపు స్వదేశీ అన్వేషణ జరుగుతుండగానే, మరోవైపు తక్షణ అవసరాల కోసం భారత్ రష్యా నుంచి భారీగా ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరియు హోర్ముజ్ జలసంధి వద్ద అంతరాయాల కారణంగా ప్రపంచ సరఫరా తగ్గడంతో, భారత రిఫైనరీలు ఏప్రిల్ డెలివరీ కోసం సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల రష్యా ముడి చమురును కొనుగోలు చేశాయి. ఇది ఫిబ్రవరి నెల కొనుగోళ్ల కంటే రెట్టింపు కావడం గమనార్హం. అమెరికా ఇచ్చిన తాత్కాలిక మినహాయింపులు కూడా రష్యా నుంచి చమురు సేకరణ పెరగడానికి మార్గం సుగమం చేశాయి.సంస్కరణలకు కొనసాగింపుగానే ఇప్పుడు 'సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకం'ను తీసుకొచ్చింది.ఈ పథకం ద్వారా భారత చమురు క్షేత్రాల్లోకి అంతర్జాతీయ ఇంధన దిగ్గజాలను ఆకర్షించడంతో పాటు, దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# ఏపీలో డిప్లమెటిక్ పాలిటిక్స్...




**విజయవాడ - సూర్య వాస్తవం**

రాజకీయాల్లో నాయకులకు వ్యక్తిగత అహం, సిద్ధాంత భేషజాలు ఉండటం సాధారణం. అయితే, ప్రజాస్వామ్యంలో అధికారం దక్కినప్పుడు వ్యక్తిగత ఆత్మగౌరవం కంటే తన్ను నమ్మి ఓటేసిన కోట్ల మంది ప్రజల ప్రయోజనాలు, రాష్ట్ర పునరుద్ధరణే ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పరిపాలనా శైలి ద్వారా స్పష్టం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఆయన పదే పదే ప్రశంసించడం, వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో మోదీ నాయకత్వాన్ని బలపరచడంపై రాజకీయ ప్రత్యర్థులు, నెటిజన్లలో కొంత మంది విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ.. ఆ విమర్శలను ఏమాత్రం లెక్కచేయకుండా చంద్రబాబు ముందుకు సాగుతున్నారు.పైకి కనిపించే ఈ ప్రశంసల వెనుక అత్యంత పటిష్టమైన కోఆపరేటివ్ ఫెడరలిజం వ్యూహం దాగి ఉందని అనుకోవచ్చు. 2024లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే నాటికి ఏపీ ఆర్థికంగా, పరిపాలనాపరంగా తీవ్ర సంక్షోభంలో మునిగిపోయింది. రాష్ట్ర బడ్జెట్ లోటు, అప్పుల భారం, నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణం, అటకెక్కిన పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాలంటే కేంద్ర ప్రభుత్వ పూర్తి స్థాయి మద్దతు, ప్రత్యక్ష ఆర్థిక నిధుల కేటాయింపు అత్యంత ఆవశ్యకం. ఈ క్రమంలో కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్రానికి రావాల్సిన ప్రతి రూపాయిని రాబట్టుకోవడం చంద్రబాబు అనుసరిస్తున్న వ్యూహాత్మక రాజకీయ లౌక్యం.ఈ లౌక్యానికి తగ్గ ఫలితాలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ సాయంతో పాటు కేంద్రం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలు, గ్రాంట్లు విడుదల చేయడం, పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు ఆమోదం తెలపడం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ ప్యాకేజీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వంటి కీలక పురోగతులు కేంద్ర-రాష్ట్రాల మధ్య ఉన్న సానుకూల సంబంధాల వల్లే సాధ్యమయ్యాయి. ప్రధాని మోదీకి, కేంద్ర కేబినెట్‌కు పదే పదే కృతజ్ఞతలు చెప్పడం ద్వారా చంద్రబాబు కేంద్ర నిధుల ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా మార్గం సుగమం చేసుకుంటున్నారు.మరోవైపు, ప్రతిపక్షాల విమర్శల నరేటివ్‌ను గమనిస్తే.. గతంలో 2018లో ధర్మపోరాటం పేరుతో మోదీపై చంద్రబాబు చేసిన ఘాటు విమర్శల వీడియోలను సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ రాజకీయ ఆత్మవంచన గా అభివర్ణించే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ, 2019 నుండి 2024 వరకు కేంద్రంతో విభేదించి రాష్ట్రం సాధించిందేమీ లేదని, తీవ్రంగా నష్టపోయిందని గ్రహించిన చంద్రబాబు.. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్న రాజకీయ పరిపక్వతను ప్రదర్శిస్తున్నారు. కేంద్రంతో ఘర్షణ వైఖరి కంటే చర్చలు-లబ్ధి విధానమే ఏపీకి మేలనే స్పష్టమైన అంచనాతో ఆయన వ్యవహరిస్తున్నారు. ఢిల్లీ పెద్దలతో ఈ సఖ్యత కేవలం నిధులకే పరిమితం కాకుండా.. విశాఖ-రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, రైల్వే జోన్ పనులు వేగవంతం కావడం, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ విద్యాసంస్థలకు కేంద్ర గ్రాంట్లు పెరగడం, కొత్త పారిశ్రామిక కారిడార్ల కేటాయింపుల్లో ఏపీ ప్రాధాన్యత పెరగడం వంటి దీర్ఘకాలిక లాభాలను తెచ్చిపెడుతోంది. జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో.. ఆ రాజకీయ ప్రభావాన్ని వ్యక్తిగత ఇమేజ్ కంటే రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి ఇంధనంగా వాడుకోవడమే చంద్రబాబు బ్రాండ్ డిప్లొమసీగా అనుకోవచ్చు. విమర్శలను స్వీకరిస్తూనే, వాటిని అధిగమించి అమరావతి సమగ్ర నిర్మాణం, పోలవరం పూర్తి, పరిశ్రమల తరలింపు ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే తమ ప్రాథమిక లక్ష్యమని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. విమర్శకులు సెటైర్లు వేసినా, సోషల్ మీడియాలో మీమ్స్ వచ్చినా.. రాష్ట్రానికి చేకూరే నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులే రేపటి రోజున తమ సమర్థతకు నిదర్శనంగా నిలుస్తాయని ఆయన విశ్వసిస్తున్నారు. వ్యక్తిగత రాజకీయ అహాన్ని పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా చంద్రబాబు నాయుడు నడుపుతున్న ఈ డిప్లొమాటిక్ పాలిటిక్స్ ఏపీ రాజకీయ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయంగా భావిస్తున్నారు.

# హైకోర్టు ఆదేశాలను అమలు చేయని అధికారులు...?

- ప్లాట్లపై ఆక్రమణ ప్రయత్నాలను అడ్డుకోవాలి
- 374 మంది లబ్ధిదారుల హక్కులకు భంగం కలిగించొద్దు
- ఏళ్లుగా ఎదురుచూస్తున్నా అందని పేదల సొంతింటి కల
- నగర పాలక సంస్థ కమిషనర్‌కు ఉమానగర్ లబ్ధిదారుల వినతి
- సమస్య పరిష్కరించకపోతే ఆందోళన తప్పదు అంటున్న మాజీ కార్పొరేటర్ వెంకట ప్రసాద్



**అనంతపురం కార్పొరేషన్ - సూర్య వాస్తవం :** అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలోని 14వ డివిజన్ (పాత వార్డు) ఉమా నగర్‌కు చెందిన 374 మంది గృహ లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్లను సర్వే చేసి, హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా వారికి అప్పగించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నగర పాలక సంస్థ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉప్పరపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 51/2, రీ-సర్వే నెం. 146/2తో పాటు సర్వే నెం. 64/2, రీ-సర్వే నెం. 147/2లో 2007 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఇందిరమ్మ గృహాల పథకం కింద తమకు ప్లాట్లు కేటాయించిందని లబ్ధిదారులు తెలిపారు. అయితే, ఇప్పటివరకు ఆ ప్రాంతంలో రహదారులు, విద్యుత్, రవాణా తదితర మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.తమకు కేటాయించిన స్థలాలను ఎటువంటి న్యాయ ప్రక్రియ లేకుండా ఇతరులకు కేటాయించేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓతో పాటు ఇతర ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించి నప్పటికీ స్పందన రాలేదని పేర్కొన్నారు. దీంతో గౌరవ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించామని తెలిపారు. డబ్ల్యూ.పి. నెం. 5214/2020లో 30.12.2020న మధ్యంతర ఉత్తర్వులు జారీ కాగా, అనంతరం ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు 08.09.2021న తుది ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. హైకోర్టు ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికీ, ఇటీవల సదరు స్థలంలో గుడి నిర్మాణం కోసం బండరాళ్లు ఉంచి మార్కింగ్ చేశారని ఆరోపించారు.ఈ విషయంపై 20.07.2026న పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుపై 15 రోజుల గడువు ఇచ్చి నప్పటికీ, ఇప్పటివరకు బండరాళ్లు, మార్కింగ్ తొలగించలేదని పేర్కొన్నారు. దీంతో తమ స్థలాలను ఆక్రమించేందుకు ప్రయ త్నాలు జరుగుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారు. 2017--18, 2018--19 సంవత్సరాల్లో అప్పటి ప్రభుత్వం ఎన్టీఆర్ గృహాల పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 374 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణానికి మంజూరు చేసిందని తెలిపారు. అయినప్పటికీ, ప్లాట్లను సరైన క్రమంలో గుర్తించి చూపించకపోవడంతో గృహ నిర్మాణం చేపట్ట లేకపోతున్నామని వాపోయారు. సదరు లే-అవుట్‌లో ఇప్పటికీ సరైన రహదారులు, విద్యుత్ లైన్లు, రవాణా సౌకర్యాలు లేకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి ప్రతి లబ్ధిదారునికి ప్లాట్‌ను స్పష్టంగా గుర్తించి కేటాయించాలని కోరారు. అలాగే, రహదారులు, విద్యుత్, రవాణా తదితర మౌలిక సదుపాయాలు కల్పించి 374 మంది లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేందుకు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్‌ను కోరారు.



## వడియంపేట, కొత్తపల్లి గ్రామాల్లో పోలీసుల స్ట్రీట్ కార్నర్ సమావేశాలు

**-మహిళల భద్రత, సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగం, సైబర్ నేరాల నివారణ, బాల్య వివాహాల నిరోధం, మత్తు పదార్థాల దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వడియంపేట, కొత్తపల్లి గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు.బీకేఎస్ ఎస్ఐ పి.వై. ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100/112 పోలీసు సేవలను వినియోగించుకోవాలని, మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అవసరమైన సమయంలో ఉపయోగించుకోవాలని తెలిపారు.సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, నిర్ధారణ కాని సమాచారం లేదా తప్పుడు వార్తలను నమ్మి ఇతరులకు పంపకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి యువత భవిష్యత్తును కాపాడాలని సూచించారు.

## సమయపాలన పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ వినతి




**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణంలో సమయపాలన పాటించని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి మనోహర్ కు బుధవారం ఎస్ఎఫ్ఐ నా యకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్ యాదవ్ మాట్లాడుతూ మాట్లాడు తూ స్థానిక గుత్తి పట్టణంలో సమ యపాలన పాటించని ప్రైవేట్ కార్పొ రేట్ పాఠశాలలపై చర్యలు తీసుకో వాలి. ఉదయం 8 గంటల నుంచి రా త్రి 8 గంటల వరకు విద్యార్థులను మానసికంగా ఇబ్బందులు గురిచే స్తూ కొన్ని పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా ప్రభు త్వం నిర్ణయించిన సమయపాలన పాటించకుండా విద్యార్థులను అక్క డే ట్యూషన్ల పేరుతో నిర్బంధించిమా నసిక ఇబ్బందులు గురి చేస్తున్నారు అలాంటి పాఠశాలను గుర్తించి చర్య లు తీసుకోవాలని ఎఫ్ఐగా డిమాం డ్ చేస్తున్నాము లేకపోతే అలాంటి పాఠశాల దగ్గర ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యం లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహి స్తామని తెలియజేస్తున్నాము. అదే విధంగా కొన్ని పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్బంధించి చదువు చెప్పే పాఠ శాలలపై చర్యలు తీసుకోవాలని కో రుతున్నాము. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, చరణ్, విజయ్, మధు తదితరులు పాల్గొన్నారు.

## సీహెచ్‌సీలో డిసిహెచ్ఎస్ డేవిడ్ ఆకస్మిక తనిఖీ



**పామిడి - సూర్య వాస్తవం:** పామిడిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ జిల్లా డిసిహెచ్ఎస్ వైద్య అధికారి డేవిడ్ పామిడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ని బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన సమావేశంలో డిసిహెచ్ఎస్ డేవిడ్ మాట్లాడుతూ పామిడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సమస్యలు ఏమైనా ఉన్నా తమ దృష్టికి తెస్తే తక్షణమే పరిష్కారం చేస్తానన్నారు తదుపరి ఆసుపత్రిలోని ప్రతి గదిని పరిశీలించారు. సంబంధించిన రికార్డులన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు వైద్య అధికారులతో పాటు సిబ్బందిని సిబ్బంద రోగుల పట్ల మానవ దృక్పథంతో సేవలు చేయాలని రోగి పట్ల ఉదార స్వభావంతో మెలాగాలని ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా నిరంతరం సేవలు చేయాలని సూచించారు. ఆస్పత్రిలో లోన బయట ఉదయం సాయంత్రం శుభ్రత పరిశుభ్రతను పాటించ వలెను సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మహేష్ కుమార్, శివ కార్తీక్ రెడ్డి, కమలాధర్, హెడ్నర్స్ విజయ్ కుమారి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- పీజీ విద్యార్థులకు ఇబ్బందిగా మారిన జీఓ నెం. 77ను రద్దు చేయాలి
- సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్
- విద్యారంగ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమం... ! బీసీవై పార్టీ
- రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు - బీసీవై పార్టీ విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా నూతన కమిటీ
- జిల్లా కన్వీనర్‌గా వాల్మీకి రామాంజి, కో-కన్వీనర్‌గా శ్రీకాంత్



**అనంతపురం సిటీ- సూర్య వాస్తవం :** రాష్ట్రంలో నెలకొన్న విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, యువగళం పాదయాత్ర సందర్భంగా విద్యార్థులకు నారా లోకేష్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీసీవై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతపురం నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో బీసీవై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా బీసీవై పార్టీ విద్యార్థి విభాగం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా కన్వీనర్‌గా వాల్మీకి రామాంజి, జిల్లా కో-కన్వీనర్‌గా శ్రీకాంత్ ఎన్నికైనట్లు ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బీసీవై పార్టీ విద్యార్థి విభాగం నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు బీసీ సురేష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యా హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పీజీ విద్యార్థులకు ఇబ్బందికరంగా మారినట్లు ఆరోపిస్తున్న జీవో నంబర్ 77ను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ, విద్యారంగ సమస్యలపై సమీక్ష నిర్వహించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇప్పటికైనా రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే బీసీవై పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాజు యాదవ్, ఎల్లప్ప, బాబు ఫక్రుద్దీన్, సాయికుమార్, నాగరాజు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# శ్వేతపత్రంపై వైసీపీ కేవీ రమణ విమర్శలు

- "బాబు పత్రమా.. ప్రభుత్వ పత్రమా?" అంటూ ప్రశ్న
- త్రిబుల్ ఇంజిన్ ప్రభుత్వం కాస్త సింగిల్ ఇంజిన్ అయిందా?



**అనంతపురం టౌన్- సూర్య వాస్తవం :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల విడుదల చేసిన ఆర్థిక రంగ శ్వేతపత్రంపై వైఎస్సార్సీపీ రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కేవీ రమణ తీవ్ర విమర్శలు చేశారు. ఈ శ్వేతపత్రం చంద్రబాబు వ్యక్తిగత పత్రమా లేక కూటమి ప్రభుత్వ అధికారిక పత్రమా అనే విషయాన్ని ముందుగా స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శ్వేతపత్రంలో పేర్కొన్న అంశాలపై కూటమి భాగస్వామ్య పక్షాలైన బీజేపీ, జనసేన తమ వైఖరిని వెల్లడించాలని కోరారు. ఎన్నికల సమయంలో "బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ" పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను 2024 జూన్ నుంచే అమలు చేసి ఉంటే, గత రెండున్నర సంవత్సరాల్లో ప్రజలకు రూ.2 లక్షల కోట్లకు పైగా ప్రయోజనాలు అందేవని కేవీ రమణ పేర్కొన్నారు. హామీల అమలులో లోటుపాట్లు ఉన్నప్పుడు శ్వేతపత్రంలో అన్ని హామీలను అమలు చేసినట్లు పేర్కొనడం సరైందా అని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ సేవలు సక్రమంగా అందడం లేదని, పేదలకు వైద్య సేవలు అందుబాటులో లేకుండా పోయాయని ఆయన ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేసి ఉంటే ప్రభుత్వ ఆధ్వర్యంలోని రాజీవ్ గాంధీ ట్రిపుల్ ఐటీల్లో సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల నుంచి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేసే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.

అమరావతి, పోలవరం, పోర్టులు, జల్ జీవన్ మిషన్, విమానాశ్రయాలు, రాష్ట్ర రహదారులు, రైల్వేలు, జాతీయ రహదారులకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధిగా పేర్కొనడం సరైంది కాదని కేవీ రమణ విమర్శించారు. ఈ అంశాలపై బీజేపీ, జనసేన నాయకత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కూటమి భాగస్వామ్య పక్షాలతో చర్చించకుండా ఏకపక్షంగా శ్వేతపత్రాన్ని విడుదల చేశారని ఆరోపించారు. దీంతో "త్రిబుల్ ఇంజిన్ ప్రభుత్వం కాస్త సింగిల్ ఇంజిన్ ప్రభుత్వంగా మారిందా?" అనే సందేహాలు తలెత్తుతున్నాయని వ్యాఖ్యానించారు. గత రెండున్నర సంవత్సరాల్లో అప్పులు పెరిగాయే తప్ప, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించలేదని కేవీ రమణ ఆరోపించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి మధ్య అభివృద్ధి, సంక్షేమం విషయంలో పోలికే లేదని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం చేయాల్సిన అభివృద్ధి పనులను ఎంత మేరకు పూర్తి చేసిందో, గ్రాంట్ల రూపంలో రాష్ట్రానికి ఎంత నిధులు అందించిందో శ్వేతపత్రంలో ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు.

ఉద్యోగుల జీతభత్యాలకు కేటాయింపులను తగ్గించడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లడం ద్వారా ఉద్యోగులు, కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం లో భాగస్వామ్య పక్షాలు పరస్పరం విమర్శించు కోవడం, మళ్లీ ఒకరినొకరు ప్రశంసించుకోవడమే ప్రగతిగా మారిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కేవీ రమణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని, శ్వేతపత్రంలో పేర్కొన్న అంశాలపై సమగ్ర వివరణ అందించాలని డిమాండ్ చేశారు.

# డ్రగ్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- "డ్రగ్స్ వద్దు బ్రో" చదివే ముద్దు అంటూ అవగాహన ర్యాలీ
- ఈగల్ సెల్ సబ్-ఇన్‌స్పెక్టర్ బాలగాని హనుమంతు




**పామిడి- సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా పామిడి పట్టణంలో ఈగల్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో మత్తు పదార్థాల నివారణపై భారీ అవ గాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైతన్య స్కూల్,శ్రీ సరస్వతి విద్యామందిర్, ట్రినిటీ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కృష్ణవేణి స్కూల్, ఎస్.ఎఫ్.ఎస్. ఈఎం హై స్కూల్, టీ.సీ. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ర్యాలీకి పామిడి పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఈగల్ సెల్ అనంతపురం సబ్-ఇన్‌స్పెక్టర్ బాలగాని హనుమంతు, సిబ్బంది నల్లపరెడ్డి, అలీ అక్బర్ పాల్గొని విద్యార్థులు, ప్రజలకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ర్యాలీలో విద్యార్థులు " డ్రగ్స్ వద్దు బ్రో", "డ్రగ్స్‌కు నో చెప్పండి -- ఆరోగ్యకరమైన జీవితానికి యెస్ చెప్పండి"మత్తుకు దూరం గా ఉండండి -- భవిష్యత్తును కాపాడుకోండి వంటి నినా దాలతో పట్టణ ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. అనంతరం నిర్వ హించిన అవగాహన కార్యక్రమంలో ఈగల్ అధికారులు ఈగల్ ఆంధ్రప్రదేశ్ టోల్ ఫ్రీ నంబర్ -- 1972 గురించి ప్రజలకు వివరించారు. మత్తు పదార్థాల విక్రయం, రవాణా, వినియోగం లేదా అనుమానాస్పద కార్యకలా పాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు గోప్యంగా 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు అందించాలని సూచించారు .ఈ సందర్భంగా " పల్లె బాటలో ఈగల్" కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించి గ్రామీణ ప్రాంతాల్లో మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్య మో వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపు నిచ్చారు. అలాగే ఈగల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న వివిధ ప్రత్యేక ఆపరేషన్లు , డ్రగ్స్ నిర్మూలన చర్యలు, అవగాహన కార్యక్రమాలు, విద్యా సంస్థల్లో చేపడుతున్న ప్రచార కార్య క్రమాలు, నిఘా చర్యలు ప్రజల సహకారంతో మత్తు పదా ర్థాల నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపా ధ్యాయులు, పోలీస్ అధికారులు, ఈగల్ సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.



## దూకుడు పెంచేనా...?
## విద్య వ్యవస్థను గాడిన పెట్టేనా...?

- ఎస్.కే.డీ ఉన్నత పాఠశాలను సందర్శించిన డీఈఓ
- విద్యార్థులతో మాటామంతీ.. బోధనా విధానాలపై ఆరా
- బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వరుస తనిఖీలు




**అనంతపురం విద్య – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా విద్యా శాఖాధికారి (డీఈఓ) డాక్టర్ అయ్యూబ్ హుస్సేన్ దూకుడు పెంచారు. ఇటీవల డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ప్రతిరోజూ జిల్లాలోని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ, విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం అనంతపురం నగరంలోని ఎస్.కె.డీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. బోధన ఎలా జరుగుతోందని, ఉపాధ్యాయుల బోధనా తీరు ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో విద్యార్థు లకు అందుతున్న విద్యా సౌకర్యాలు, బోధనా విధానాలు, విద్యార్థుల అభ్యాస స్థాయిపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పని చేయాలని సూచించినట్లు సమాచారం.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

- నూతన కార్యవర్గ సభ్యులను అభినందించిన జిల్లా కలెక్టర్
- సమిష్టి భావంతో రెడ్ క్రాస్ సేవలను విస్తరించాలని సూచన



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. విద్య, వైద్య, వ్యాపార, సామాజిక సేవలతో పాటు వివిధ రంగాలకు చెందిన అనుభవజ్ఞులు ఒకే వేదికపై చేరి సమర్థవంతమైన కార్యవర్గంగా ఏర్పడటం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులందరూ సమిష్టి భావంతో, సేవా దృక్పథంతో పనిచేస్తూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ గారు సూచించారు. సమాజంలో అవసరమైన వారికి సకాలంలో సేవలు అందించేందుకు కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు.

## వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- 18 సంవత్సరాలుగా ఇంటి పట్టాలు పొంది బేస్ మట్టాలు వేసిన నేటికీ అన్యాయం ఎదుర్కొంటున్న విలేకరులు



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని అనంత పురం రోడ్డు గేట్స్ హాస్టల్ 10/10/2009లో పొలంలో రాళ్లు ఎత్తుపల్లంగా భూమి ఉంది. దాన్ని పరిగణలోకి తీసుకొని 2009లో అప్పటి ఎమ్మెల్యే కె. మధుసూదన్ గుప్తా ఇళ్ల పట్టాలు మాకు ఇచ్చారు. అందులో ఇద్దరు వి లేకరులు బేసి మట్టాలు వేశారు. అంత కుముందు 2004లో సాగు పట్ట లు పొందిన అక్కాచెల్లెలు 2008 వ రకు పొలం సాగు చేయలేదు. ఈ విషయాన్ని అప్పటి ఆర్డీఓ గౌతమి పొ లం పరిశీలించి,భూమి సాగులో లే నందున నాగలక్ష్మి నాగతరత్నమ్మ లకు ఇచ్చిన సాగుపట్టలు రద్దు చేసి,స్థానిక విలేకరులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఆదేశించారు. 21మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కాలక్రమేనా 35 వరకు విలేకరుల సంఖ్య ఉంది. 35 విలేక రులకు అన్యాయం చేశారు. కోర్టుకు తన్నీరు శ్రీనివాసులు సీనియర్ విలే కరి,ముఖ్యమంత్రికి,రెవెన్యూ మినిస్ట ర్ కి,కలెక్టర్ కి,అర్జీ పెట్టిన తర్వాత ప్ర స్తుత తాసిల్దారు పై సర్వే నెంబర్లోని భూమి పరిశీలించి 01-05-2026న ఎండా ర్స్మెంట్ ముఖ్యమంత్రికి కలెక్ట ర్ కి అర్జీ దారుడైన తన్నీరు శ్రీనివాసులు పంపారు. కానీ ఇప్పటికీ మూ డు నెలలు గడిచిన ఎటువంటి చర్య లు లేవు. 18 సంవత్సరాలుగా ఇళ్ల పట్టాలు ఇచ్చిన అధికారులు, విలేకరుల విషయంలో జాప్యం చేసినందుకు చింతిస్తున్నామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా విలేకరులకి న్యాయం జరిగిన గుత్తిలో మాత్రం విలేకరులకి ఇచ్చిన పట్టాలకు మాత్రం ఎందుకు న్యాయం జరగడంలేదో తమరే పరిశీలించాలన్నారు. లేని పక్షంలో ఈనెల 14వ తేదీలోగా చర్యలు తీసుకోకపోతే 15/08/2026 తేదీన గాంధీ చౌక్ వద్ద ధర్నాకు అనుమతి ఇవ్వగలరాని విన్నవించుకున్నారు.

# మానవత్వం మరిచారా ...?

- విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం...
- గురుకులంలో దారుణ పరిస్థితులు
- మూడు నెలలుగా శుభ్రం కాని మరుగుదొడ్లు
- నీటి కొరతతో విద్యార్థుల అవస్థలు, అధికారుల నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆగ్రహం




**కణేకల్లు– సూర్య వాస్తవం :** “అమ్మా... నాన్నా... ఈ స్కూల్లో ఉండలేం... ఇంటికి తీసుకెళ్లండి” అంటూ విద్యార్థులు కన్నీటి పర్యంతమవుతున్న ఘటన కణేకల్లు క్రాస్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వెలుగుచూసింది. పాఠశాలలో నెలకొన్న అపరిశుభ్ర పరిస్థితులు, మరుగుదొడ్ల దుస్థితి, తాగునీటి సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్న ఈ గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లను గత మూడు నెలలుగా శుభ్రం చేయకపోవడంతో అవి పూర్తిగా మలంతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. మరుగు దొడ్లలోకి వెళ్లేందుకు కూడా విద్యార్థులు భయపడే పరిస్థితి నెలకొంది. పరిశుభ్రత లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రతి ఆదివారం జరిగే తల్లి దండ్రుల సమావేశంలో విద్యార్థులు తమ ఇబ్బందులను కన్నీళ్లతో వివరించారని సమాచారం. ఈ సమస్యను పలుమార్లు పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పాఠశాలలో నీటి సరఫరా కూడా సక్రమంగా లేక పోవడంతో విద్యార్థులు తాగునీరు, మరుగుదొడ్ల వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలిపారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా విద్యార్థుల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.”ఇలాంటి పరిస్థితుల్లో మా పిల్లలను చదివించడం కష్టంగా మారింది. అధికారులు వెంటనే స్పందించి పాఠశాలలో పరిశుభ్రత చర్యలు చేపట్టి, నీటి సమస్యను పరిష్కరించాలి. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం” అని తల్లిదండ్రులు హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఆధారాలతో మాట్లాడండి.. లేదంటే సైలెంట్‌గా కూర్చోండి

- మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణలపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం
- మెగా డీఎస్సీపై నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు
- గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శ
- రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం :** మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజల ముందు పెట్టాలని, లేకపోతే సైలెంట్‌గా ఉండాలని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. నారాయణపురం గ్రామంలో నిర్వహించిన ‘ఇంటింటికీ కూటమి ప్రభుత్వం’ కార్యక్రమానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం భువనేశ్వర్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, అక్కడి సౌకర్యాలు, నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇది కక్షలు, కార్పణ్యాలు తీర్చుకునే ప్రభుత్వం కాదని, ప్రజా క్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న కూటమి పాలన అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థను తీవ్రంగా దెబ్బతీశారని ఆరోపించారు. అలాంటి కీలక శాఖను మంత్రి నారా లోకేష్ సవాలుగా స్వీకరించి విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. 16,347 ఉపాధ్యాయ పోస్టులను ఎలాంటి వివాదాలకు తావులేకుండా భర్తీ చేశామని, అయినప్పటికీ మెగా డీఎస్సీపై వైసీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఆరోపణలకు సరైన ఆధారాలు ఉంటే బయటపెట్టాలని, నిరాధార విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని సూచించారు. రాయలసీమ ప్రాజెక్టులను గత పాలకులు ఏ రోజైనా పట్టించుకున్నారా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి భారీ పెట్టుబడులను తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. నిరాధార ఆరోపణలు, రాజకీయ విమర్శలు మానుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు.

# అక్రమ అరెస్టులు, కేసులకు కేరాఫ్ అడ్రస్‌గా కూటమి ప్రభుత్వం

- ముస్తఫా అరెస్టు కక్షసాధింపు చర్యలో భాగమే : మొఘల్ సైఫుల్లా బేగ్
- వైసీపీ నేతలను భయపెట్టేందుకే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపణ
- వైసీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మొఘల్ సైఫుల్లా బేగ్ విమర్శ




**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** అక్రమ అరెస్టులు, అక్రమ కేసులకు ఆంధ్రప్రదేశ్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని వైసీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మొఘల్ సైఫుల్లా బేగ్ విమర్శించారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో మాజీ మేయర్ మహమ్మద్ వసీంతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొఘల్ సైఫుల్లా బేగ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలను సరైన ఆధారాలు లేకుండానే అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే, మైనార్టీ నేత ముస్తఫాపై భాగస్వాముల మధ్య జరిగిన వ్యాపార లావాదేవీల వివాదానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, గుజరాత్‌కు వెళ్లి మరీ అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో పోలీసులు టీడీపీ నేతలు చెప్పినట్లుగా నడుచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతోందా? లేక రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందా? అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి కూటమి నేతలు భయ పడుతున్నారని, వైసీపీ నాయకులను భయపెట్టేందుకే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. అక్రమ కేసులకు ఎవరూ భయపడరని, వాటిపై న్యాయబద్ధంగా పోరాడుతామని స్పష్టం చేశారు. మాజీ మేయర్ మహమ్మద్ వసీం మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం 25 నెలల పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని విమర్శించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తూ అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలను రక్షించాల్సిన పోలీసులు సైతం టీడీపీ నేతలు చెప్పినట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎలాంటి నేర చరిత్ర లేని మైనార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ముస్తఫా వ్యాపార వ్యవహారాన్ని రాజకీయాలతో ముడిపెట్టి అక్రమ కేసు నమోదు చేసి అరెస్టు చేశారని ఆరోపించారు. ముస్తఫా కుటుంబానికి రాష్ట్రంలోని మైనార్టీలంతా అండగా ఉంటారని పేర్కొన్నారు. డీఎస్సీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలనే డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో, ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. అందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యే ముస్తఫాను అరెస్టు చేశారని ఆరోపించారు. వైసీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి వేముల నదీమ్ మాట్లాడుతూ, మచ్చలేని నాయకుడైన ముస్తఫాను కక్షసాధింపు చర్యల్లో భాగంగానే అరెస్టు చేశారని ఆరోపించారు. తొలినుంచి మైనార్టీలు వైసీపీ వెంట నడుస్తున్నారని, దీనిని జీర్ణించుకోలేక కూటమి నేతలు మైనార్టీలను వేధిస్తున్నారని విమర్శించారు. మహిళా విభాగం నాయకురాలు ఖమర్ తాజ్ మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే ముస్తఫా అరెస్టుతో మైనార్టీల గొంతును నొక్కలేరని అన్నారు. మైనార్టీలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు మైనార్టీలంతా సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఇషాక్, మహబూబ్ బాషా, ఏ--1 రఫీ, ఖాదర్, అబ్బాస్, కిషోర్, ఖమర్ తాజ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హక్కుల పరిరక్షణకు చర్యలు

## - మంత్రుల బృందం సమావేశంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్ యాదవ్



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** రాష్ట్ర వైద్య,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ న్యూఢిల్లీ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన బీసీ పరిరక్షణ చట్టానికి సంబంధించి ఏర్పాటు చేసిన మంత్రుల బృందం (గ్రూప్ అఫ్ మినిస్టర్స్ -జిఒఎం) సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ వర్గాల హక్కుల పరిరక్షణ,చట్టపరమైన అంశాలు, సామాజిక న్యాయం, సాధికారతకు దోహదపడే చర్యలపై విస్తృతంగా చర్చించి పలు సూచనలు చేశారు. బీసీ వర్గాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, వారి హక్కులకు మరింత బలమైన చట్టపరమైన రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ముర్రిపాలు బిడ్డకు ఆరోగ్యం...

## - వ్యాధి నిరోధక శక్తి పెంచుతుంది... : సిడిపిఓ జ్యోతి కిరణ్



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** ముర్రిపాలు బిడ్డకి ఆరోగ్యం...వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రిపాలు తాగించాలని సూళ్లూరుపేట సిడిపిఓ జ్యోతి కిరణ్ అన్నారు. ఆమె బుధవారం దొరవారిసత్రం మండల పరిధిలోని నేలపట్టు అంగనవాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన తల్లిపాలు వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రిపాలు తాగిస్తే ఆ బిడ్డకు ముర్రిపాలు అమృతంలా పనిచేస్తుంది, అంతేకాకుండా ఆరు నెలల పాటు తల్లిపాలు బిడ్డకు పట్టించాలి అని తెలియజేశారు. అనంతరం సూపర్వైజర్ అంకమ్మ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డలకు అత్యంత శ్రేయస్కరమని తెలిపారు.తల్లిపాలు బిడ్డలకు సక్రమంగా అందినట్లయితే చిన్నారులు భవిష్యత్తులో బలంగా మంచి ఆరోగ్యంగా తయారవుతారని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో కార్యకర్తలు ఈ విషయమై తల్లులకు అవగాహన కల్పించాలని ఆమె కోరారు. గర్భవతులు,బాలింతలు,కిశోర బాలికలు ఎటువంటి ఆహారం తీసుకోవాలో వివరించారు.కిషోర్ బాలికలు ముఖ్యంగా రక్తహీనత విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, టాటా ట్రస్ట్ కోఆర్డినేటర్ అరుణ, అంగన్వాడి కార్యకర్తలు సుబ్బమ్మ,ప్రభావతి, కవిత, బాలింతలు, గర్భవతులు తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** సూళ్లూరుపేట పట్టణంలోని కోళ్ల మిట్ట,(కె.ఆర్ పాలెం )సూళ్లూరు దళితవాడ అంగన్వాడీ కేంద్రాలలో బుధవారం తల్లిపాల వారోత్స వాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ జ్యోతి కిరణ్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డలకు అత్యంత శ్రేయస్కరమని తెలిపారు.తల్లిపాలు బిడ్డలకు సక్రమంగా అందినట్లయితే చిన్నారులు భవిష్యత్తులో బలంగా తయారవుతారని అన్నారు.అంగన్వాడీ కేంద్రాలలో కార్యకర్తలు ఈ విషయమై తల్లులకు అవగాహన కల్పించాలని ఆమె కోరారు.గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు ఎటువంటి ఆహారం తీసుకోవాలో వివరించారు.కిషోర్ బాలికలు ముఖ్యంగా రక్త హీనత విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ మనుషా సింగ్, కార్యకర్తలు సౌజన్య, చెంగమ్మ, సురేఖ, భాను, సునీత, సుభాషిని, సుమతి, నాగలక్ష్మి, సుమ, హేమలత, చెంచమ్మ, పోర్షియా, మార్గలేవా తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల కష్టాల్లో తోడుగా...ఆపదలో అండగా...

## - సేవలో ఎప్పుడూ ముందుగా! : మంత్రి సత్య కుమార్ యాదవ్




**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** ప్రజా సేవ అంటే కేవలం మాటలు కాదు... అవసరమైన సమయంలో ప్రజలకు అండగా నిలవడం.అదే సేవా తత్వాన్ని ఆచరణలో చూపిస్తూ, ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు ప్రతి అడుగులో భరోసాగా నిలుస్తున్నారు ఆంధ్రప్రదేశ్ వైద్య,ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్.అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తూ అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ అండ చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.మంత్రి సత్య కుమార్ ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ధర్మవరం నియోజకవర్గంలో ఇప్పటివరకు 988 మంది లబ్ధిదారులకు రూ 10.14 కోట్ల ఆర్థిక సహాయం అందింది.ధర్మవరం టౌన్--414 మందికి రూ 3.27 కోట్లు.ధర్మవరం రూరల్--144 మందికి రూ 1.75 కోట్లు.బత్తలపల్లి మండలం --157 మందికి రూ 1.89 కోట్లు.తాడిమర్రి మండలం--133 మందికి రూ1.62 కోట్లు.ముదిగుబ్బ మండలం--140 మందికి రూ 1.61 కోట్లు. రూపాయలు సీఎం సహాయనిది లబ్ధిదారులకు అందించిన ఘనత రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్. అంతేకాకుండా ఒక కుటుంబం కష్టాల్లో ఉందని తెలిసినా స్పందించే హృదయం ఒక ప్రాణం కాపాడేందుకు ప్రతి అవకాశాన్ని వినియోగించే సంకల్పం ప్రజల బాధనే తన బాధగా భావించే మానవత్వం ఇవే మంత్రి సత్య కుమార్ యాదవ్ నాయకత్వానికి అసలైన గుర్తింపు.ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యం... ప్రజల సంక్షేమమే లక్ష్యం... ప్రజల ఆశీర్వాదాలే ఆయనకు అతిపెద్ద బలం."ఆపదలో ఆదుకునే చేయి... ప్రజల గుండెల్లో నిలిచే నాయకత్వం." "సేవను రాజకీయంగా కాదు... బాధ్యతగా భావించే ప్రజా నాయకుడు.""ప్రతి లబ్ధిదారుడి చిరునవ్వులో... మంత్రి సేవా స్ఫూర్తి ప్రతిబింబిస్తుంది."

## శ్రీ శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా

# బాధ్యతలు స్వీకరించిన తిరుమూరు సుధాకర్ రెడ్డి



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, సూళ్లూరుపేటలోని శ్రీ శ్రీ శ్రీ చెంగాలమ్మ మాత పరమేశ్వరి దేవస్థానం అభివృద్ధి కమిటీ (ట్రస్ట్ బోర్డు) నూతన చైర్మన్‌గా సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్.నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆశీస్సులతో ఆయనకు ఈ బాధ్యతలు దక్కాయి. ఈ సందర్భంగా బుధవారం ఘనంగా ప్రమాణ స్వీకార మహోత్సవం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం జరిపింది. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం అందించారు. నాయకుల ఆశీస్సులకు ధన్యవాదాలు బాధ్యతల స్వీకరణ అనంతరం తిరుమూరు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ. తనపై నమ్మకంతో ఈ పవిత్ర బాధ్యతను అప్పగించిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి, సీనియర్ నాయకులు నెలవల సుబ్రహ్మణ్యంకి,పార్టీ అధిష్టానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



ఆలయాభివృద్ధే ధ్యేయం అమ్మవారి కృపాకటాక్షాలతో ఆలయ సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నూతన చైర్మన్ స్పష్టం చేశారు.దాతల సహకారం,ప్రభుత్వ మద్దతుతో ఆలయ పరిసరాలను మరింత సుందరీకరించడం దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన లైన్లు,వసతి,ప్రసాద వితరణలో మెరుగైన సౌకర్యాలు కల్పించడం. రాబోయే ఉత్సవాలను,ఆధ్యాత్మిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించడం. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులు, కార్యకర్తలు, ఆలయ అధికారులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిరుమూరు సుధాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# డీఎస్సీ అక్రమాలపై రిలే నిరాహార దీక్షలు

## - సీబీఐ విచారణ, మంత్రి నారా లోకేష్ రాజీనామాకు డిమాండ్

## - ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, నిరుద్యోగ భృతి అమలు చేయాలని పిలుపు

**పెళ్లకూరు- సూర్య వాస్తవం :** రాష్ట్రంలో డీఎస్సీ నియామకాలలో జరిగిన అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 9వ తేదీ వరకు నాయుడుపేటలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి సూచనలతో, మాజీ సూళ్లూరుపేట ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య, రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈ దీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రిలే నిరాహార దీక్షలు కొన సాగుతాయని తెలిపారు. డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ నిర్వహించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని, విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ దీక్షలకు ప్రజలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియో జకవర్గ, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఓబ్బు వెంకటరత్నం, విజ్ఞప్తి చేశారు.







# బీసీల హక్కుల సాధనకు ఢిల్లీలో గర్జన

**- జంతర్‌మంతర్‌ను హోరెత్తించిన బీసీ ఉద్యమం**
**- కేంద్రం వెంటనే డిమాండ్లు నెరవేర్చాలి**



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రమణ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నలు మూలల నుంచి వేలాది మంది బీసీ సోదరులు, బీసీ మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో ఉద్యమాన్ని ఉధృతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బీసీల హక్కులను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని దేశ వ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీసీల న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేసి, సామాజిక న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కడప జిల్లా నుంచి జిల్లా బీసీ అధ్యక్షుడు రాజా, మండల బీసీ అధ్యక్షుడు మల్లె బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు బోల శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు రాళ్లపాటి చిన్న మస్తాన్, బీసీ కార్యవర్గ సభ్యుడు ఆదిబోయిన గురవయ్య, ప్రముఖ బీసీ నాయకుడు వనిపెంట సుబ్బరాయుడు తదితరులు ధర్నాలో పాల్గొని బీసీల హక్కుల కోసం తమ గళాన్ని వినిపించారు. "బీసీల హక్కులు సాధించే వరకు పోరాటం ఆగదు... కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీల న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలి" అని నాయకులు స్పష్టం చేశారు.



# స్వచ్ఛ సంకల్ప దీక్ష విజయవంతం కోసం భారీ ర్యాలీ

**- కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్**



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం:** పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రొద్దుటూరులో సంపూర్ణ ప్లాస్టిక్ నివారణకు పురపాలక సంఘం ద్వారా అన్ని చర్యలు చేపడుతున్నామని కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. బుధ వారం కమీషనర్ మాట్లాడుతూ ప్రజలు సహకారం ఉంటే ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరు సృష్టించడం కష్టమేమి కాదని, వచ్చే ఆగష్టు 15 నుంచి ప్లాస్టిక్ ను ప్రొద్దుటూరులో పూర్తిగా నిషేదించడానికి బ్లూ ప్రింట్ తయారు చేసామని అన్నారు. ప్లాస్టిక్ విక్రయాలపై వ్యాపారస్తులకు స్వీయ నియంత్రణ ఉండాలని, దుకాణాల్లో ప్లాస్టిక్ క్రయవిక్రయాలు, వినియోగం జరగకూడదని, జరిగితే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని కమీషనర్ అన్నారు. ప్లాస్టిక్ నివారణకోసం, పర్యవేక్షనకు ఒక టాస్క్ ఫోర్స్ కూడా ఏర్పాటు చేయనున్నామని స్వచ్ఛ సంకల్ప దీక్షకు సహకరించని వారిపై శాఖపరమైన చర్యలు ఉంటాయని కమీషనర్ అన్నారు. ప్రొద్దు టూరులో రోజుకి 18 నుంచి 20 టన్నుల ప్లాస్టిక్ చెత్తను తమ పారిశుధ్య కార్మికులు కలెక్ట్ చేస్తున్నారని, భారీస్థాయిలో ప్రజలకు, పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్ నివారణకు వ్యాపార సంస్థలు సహకరించాలని కమీషనర్ కోరారు. దానిలో భాగంగా ఆగష్టు 06 తేదీన మెప్మా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నామని, శాసనసభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొనే ఈ కార్యక్రమం అనిబిసెంట్ మున్సిపల్ హై స్కూల్ నుంచి ప్రారంభమై మెయిన్ రోడ్డు శివాలయం వరకు మెప్మా సిబ్బంది ర్యాలీగా వస్తారని అనంతరం మానవహారంగా ఏర్పాటై ప్రజలను, వ్యాపారస్థులను ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించడం జరుగుతుందని కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా మహాలక్ష్మి, శానిటేరీ సూపర్ వైజర్ నూర్ బాషా పాల్గొన్నారు.

# పాదయాత్రలు జయప్రదం చేయండి

**- పి. రామచంద్రయ్య**
**- చలో ఢిల్లీ గోడ పత్రికలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు**



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 6 నుండి 15 తేదీ వరకు సిపిఐ చేపట్టబోయే పాదయాత్రలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. రామచంద్రయ్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో చలో ఢిల్లీ గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి రాకముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టారని, అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు పూర్తయిన ఏ ఒక్క హామీని నెరవేర్చింది లేదన్నారు. బిజెపి ప్రభుత్వం మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతూ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిపై దాడులకు పాల్పడుతూ, దేశద్రోహులంటూ నిర్బంధాలకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఐ జాతీయ సమితి కార్యక్రమంలో భాగంగా మార్పు అవసరం అనే నినాదంతో పాదయాత్రలు, ప్రచార యాత్రలు చేపట్టి, ఈనెల 18న కలెక్టరేట్ ముట్టడి చేపడు తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గింపు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మహిళలకు రక్షణ చట్టం, విద్యా, వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి పి. భీమ లింగప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు డి. రాజా సాహెబ్, మండల కార్యదర్శి యు. కారుమంచి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు కారన్న, పెద్ద ఈ రన్న, గిడ్డయ్య గౌడ్, నెట్టికంటయ్య, ప్రజా సంఘాల నాయకులు రంగన్న, జోహారాపురం కాశి, మాదన్న, గుండు భాష, ఖాన్, నాగరాజు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మినీ వాటర్ ట్యాంకును పరిశీలించిన డిప్యూటీ ఎంపీడీవో అశ్వత్త నాయుడు



**పామిడి – సూర్య వాస్తవం:** మండలంలోని పి.కొండాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంకును బుధవారం డిప్యూటీ ఎంపీడీవో అశ్వత్తా నాయుడు, గ్రామ పంచాయతీ ఈఓ శివమూర్తి పరిశీలించారు. ట్యాంకు ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి పరిస్థితిని పరిశీలించి, నీటి సరఫరా సక్రమంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు నాణ్యమైన తాగునీటిని అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండ కూడదని అధికారులు తెలిపారు. తాగునీటి సరఫరాలో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు..

# రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్యాడెట్ల ఎంపిక

**- విజయవాడలో జరిగే వేడుకల్లో యూత్ రెడ్ క్రాస్ కంటింజెంట్ తరపున పాల్గొననున్న పరశురాముడు, రాజ్‌కుమార్**



**ఉరవకొండ – సూర్య వాస్తవం:** ఈ నెల 15న విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పరేడ్‌లో యూత్ రెడ్ క్రాస్ కంటింజెంట్ తరఫున పాల్గొనేందుకు ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు క్యాడెట్లు ఎంపికయ్యారు.కళాశాలకు చెందిన బి.కాం మూడో సంవత్సరం విద్యార్థి బి. పరశురాముడు, బి.ఏ రెండో సంవత్సరం విద్యార్థి టి. రాజ్‌కుమార్ ప్రతిష్టాత్మక రాష్ట్ర స్థాయి పరేడ్‌కు ఎంపికైనట్లు కళాశాల వర్గాలు వెల్లడించాయి.పరేడ్‌లో పాల్గొనేందుకు వీరికి అమరావతిలోని వీఐటీ యూనివర్సిటీలో ఈ నెల 6వ తేదీ నుంచి ప్రత్యేక శిక్షణ నిర్వహించనున్నారు. శిక్షణ అనంతరం ఆగస్టు 15న జరిగే రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పరేడ్‌లో వీరు పాల్గొననున్నారు.రాష్ట్ర స్థాయి పరేడ్‌కు ఎంపికై కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. శైలజా రాణి, వైస్ ప్రిన్సిపల్ టి.ఎన్. మస్తానప్ప అభినందించారు. క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమించి ఈ ప్రతిష్టాత్మక అవకాశాన్ని సాధించడం అభినందనీయమని కొనియాడారు.ఈ సందర్భంగా యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్, బోటనీ అధ్యాపకురాలు విష్ణుప్రియ, ఎన్‌సీసీ కేర్‌టేకింగ్ ఆఫీసర్, ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్‌తో పాటు అధ్యాపకులు క్యాడెట్లకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రమాదకర చెట్టు తొలగింపు

**- 'సూర్య వాస్తవం' కథనానికి స్పందన..**





**చెన్నూరు– సూర్య వాస్తవం:** కొండపేటలో గ్రామ సచివాలయానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఫారెస్ట్ కాంపౌండ్‌లో ప్రమాదకరంగా ఎండి పోయి ఉన్న భారీ చెట్టును అధికారులు తొలగించారు. ఈ సమస్యపై ఇటీవల సూర్య వాస్తవంలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అటవీ శాఖ, రెవెన్యూ శాఖ, గ్రామ పంచాయతీ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. నిత్యం ప్రజలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే ఈ మార్గంలో ఎండిపోయిన చెట్టు ఎప్పుడు కూలిపోతుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. గాలి, వర్షాల సమయంలో ప్రమాదం సంభవించే అవకాశం ఉండటంతో స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు ప్రమాదకర చెట్టును తొలగించి ప్రజలకు ఊరట కల్పించారు. ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకున్న అధికారులను గ్రామస్థులు అభినందిస్తూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చిన సూర్య వాస్తవం కథనం సమస్య పరిష్కారానికి దోహదపడిందని పేర్కొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం





**పామిడి – సూర్య వాస్తవం:** స్వచ్ఛ ఆంధ్ర--స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పామిడి మండలం పి కొండాపురం గ్రామంలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో అశ్వత్థామ నాయుడు, పంచాయతీ ఈఓ శివమూర్తి, ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి రహదారులు, కాలువలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త బుట్టల్లో వేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మరియు టీడీపీ వలిపి రామాంజీ. రమేష్.కామలపాడు రామాంజనేయులు, పారిశుద్ధ్య కార్మికులు, టీడీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )